క్లుప్తంగా...

నేడు డయల్ యువర్ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. ఆర్టీసీ కొంత కాలంగా ప్రయాణికుల ఆదరణ చూరగొంటుందని, ప్రజల అవసరాలను గుర్తించి ఆయా రూట్లలో బస్సు సర్వీసులు వేస్తుండటమే దీనికి కారణమన్నారు. కాలనీ సంక్షేమ సంఘం వారు, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు బస్సు సర్వీసుల విషయంపై తమ సలహాలు, సూచనలు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా తనకు తెలపవచ్చని ఆయన అన్నారు. దీని కోసం తాము నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు మధ్యలో 995922 6133లో తమ సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని ఆయన తెలిపారు.

నేటి నుంచి అభినయంపై వర్క్‌షాప్

గన్‌ఫౌండ్రీ: భారతీయ సాంప్రదాయ నృత్య రీతిలో అభినయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని ది డ్యాన్స్ ఇండియా మ్యాగ్జిన్ నిర్వాహకులు బీఆర్.విక్రమ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి రవీంద్రభారతిలో అభినయంపై మూడు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారికి ప్రముఖ నృత్య గురువు పద్మభూషణ్ సరోజ వైద్యనాదం చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

గో సేవ



గో సేవ చేస్తున్న కార్తీక్

గోల్కొండ: కేసరి హనుమాన్ యువ సంఘటన్ ద్వారా క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంఘటన అధ్యక్షులు కార్తీక్ అన్నారు. గురువారం వారు యువ సంఘటన్ ఆధ్వర్యంలో గో సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘటన్ సభ్యులు గోవులకు గ్రాసం వేశారు. అనంతరం సంఘటన సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లి అక్కడి రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘటన్ అధ్యక్షుడు కార్తీక్, సభ్యులు సందీప్, రాజన్, రక్షిత్, లోకేష్ తదితరులున్నారు.

మామిళ్ల రాజేందర్‌కు సన్మానం



అబిడ్స్: టీఎన్జీఓస్ నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. మరోసారి టీఎన్జీఓస్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికై న మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌ను టీఎన్జీఓస్ వాణిజ్య పన్నుల శాఖ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రహ్మత్ అలీలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల ప్రగతి, బంగారు తెలంగాణ కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా త్రినేత్ర హనుమాన్ జయంతి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

డబీర్‌పురా: డబీర్‌పురా ఉస్మాన్‌పురాలోని హనుమాన్ ఆలయంలో గురువారం త్రినేత్ర హనుమాన్ జయంతి, రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు రుద్రాభిషేకం, 9.30 గంటలకు సహస్రనామార్చన అష్టోత్తర శతం, సాయంత్రం 5 గంటలకు హవనం (యజ్ఞం), 7 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు భండారా, భజన కీర్తనలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో వార్షిక డిస్‌ప్లే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో వార్షిక డిస్‌ప్లే-2023 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఎమ్ఎఫ్ఏ ప్రోగ్రామ్ అవుట్‌గోయింగ్ బ్యాచ్ విద్యార్థుల ప్రదర్శన ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది.

అలంకారప్రాయంగా ఫుడ్ వెండింగ్ జోన్

- నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి ఆలస్యం
- ఇక్కడే చెత్త వేస్తున్న హోటళ్ల సిబ్బంది
- వచ్చే వారంలో ప్రారంభిస్తామంటున్న ఈఈ, లాల్ సింగ్



ప్రారంభానికి నోచుకోని ఫుడ్ వెండింగ్ జోన్

నాంపల్లి: ఆసిఫ్‌నగర్ మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ నిర్మించిన ఫుడ్ వెండింగ్ జోన్ అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. మల్లేపల్లి ఐటీఐ వద్ద నిర్మించిన 12 ఫుడ్ వెండింగ్ జోన్‌కు మంచి స్పందన రావడంతో అదే తరహాలో ఆసిఫ్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఎనిమిది డబ్బాలతో కూడిన మరో ఫుడ్ వెండింగ్ జోన్‌ను నిర్మించారు. ఈ ఫుడ్ వెండింగ్ జోన్ పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వాటి ప్రారంభోత్సవం జరగలేదు. ఆసిఫ్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిర్మించిన ఫుడ్ వెండింగ్ జోన్ చుట్టూ చెత్త కుండీలు ఉండటం, పక్కనే సామూహిక మరుగుదొడ్లు ఉండటం వీటి ప్రారంభోత్సవానికి పెద్ద అడ్డంకిగా మారాయి. ప్రతి రోజూ ఉదయాన్నే చెత్తను తరలించినా రాత్రి హోటల్స్ యజమానులు తమ హోటల్స్ నుంచి వెలువడే వ్యర్థాలను అక్కడ పారబోయడం జీహెచ్ఎంసీకి తలనొప్పిగా మారింది. దీనికి తోడు వీటి నిర్మాణాలు కూడా పూర్తి స్థాయిలో జరగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పారదర్శకంగా ఎంపిక చేస్తాం..

ఫుడ్ వెండింగ్ జోన్ పనులు పూర్తయ్యాయి. వచ్చే వారంలో వీటి ప్రారంభిస్తాం. పక్కనే ఉన్న సామూహిక మరుగుదొడ్లు తొలగింపులో కొంచెం ఆలస్యం జరుగుతోంది. పత్రికా ప్రకటన ఇచ్చి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తాం.

– లాల్‌సింగ్, జీహెచ్ఎంసీ మెహిదీపట్నం సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

నల్లాల్లో కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి



నల్లాలో వస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నల్లాలలో కలుషిత నీరు వస్తే జలమండలి అధికారులే దీనికి బాధ్యత వహించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకి, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండీ లైన్స్ తదితర బస్తీల్లో స్థానికులు ఆయనకు తమ సమస్యలను వినిపించారు. నల్లాలలో రంగు మారిన తాగునీరు వస్తుందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆయనకు ఫిర్యాదు చేశారు. నల్లా నీటిని కాచి వడబెట్టి తాగునీటిని తాగుతున్నా తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నదని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లాలో వస్తున్న నీటిని పరిశీలించారు. నల్లాలలో రంగు మారిన చెడు వాసనతో నీరు రావడం గమనించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజల ఆరోగ్యం విషయం మీరేం పట్టించుకోరాని ఆయన ప్రశ్నించారు. ప్రజలు నీటి బిల్లులు కడుతున్నా కూడా నల్లాలలో కలుషితమైన నీరు రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని ఆయన అన్నారు. వెంటనే సిబ్బందిని పంపి నల్లాలలో కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన ఎండీ లైన్స్-గోల్కొండ రోడ్డు తదితర ప్రాంతాలలో జరుగుతున్న డ్రైనేజీ రీమోడలింగ్ పనులను పరిశీలించారు.బల్దియా ఏఈతో పాటు మజ్లిస్ గోల్కొండ డివిజన్ నాయకుడు మహ్మద్ బదర్ ఉద్దీన్ తదితరులున్నారు.

చార్‌ధామ్ యాత్రకు ప్రత్యేక దుస్తులు



ఎగ్జిబిషన్‌లో చార్‌ధామ్ యాత్రకు సంబంధించిన ప్రత్యేక దుస్తులు

చార్మినార్: ప్రస్తుతం యాత్రికులంతా చార్‌ధామ్ యాత్ర నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మంచు పర్వతాల్లోని గంగోత్రి, యమునోత్రి, కేధార్‌నాథ్, బద్రీనాథ్ తదితర తీర్థ స్థలాలను సందర్శించేటప్పుడు అక్కడి వాతావరణాన్ని తట్టుకునే విధంగా ధరించే దుస్తులను పాతబస్తీ మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాస్ బుకారీ 20శాతం డిస్కౌంట్‌తో అందజేస్తున్నారు. మఫ్లర్లు, శాలువాలు, గ్లౌవజులు, సాక్షులు, టీషర్టులు.. ఇలా ప్రత్యేకంగా రూపొందించిన దుస్తులతో కూడిన ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ఎగ్జిబిషన్‌లో దుస్తుల ప్రదర్శన ఉంటుంది. సరసమైన ధరలకు అందుబాటులో ఉండే విధంగా దుస్తులను రూపొందించి వినియోగదారులకు అందుబాటులో ఉంచామని మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని ఇలియాస్ బుకారీ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: జర్మనీ దేశంలో ఐటీ జాబ్స్ భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టాంకాం) జనరల్ మేనేజర్ నాగభారతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ సంస్థలలోని సాఫ్ట్‌వేర్ డెవలపర్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్స్, ప్రాజెక్ట్ మేనేజర్, ఐటీ సపోర్ట్, డేటా ఇంజినీర్స్ తదితర ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీ కంప్యూటర్స్, బీఈ, బీటెక్, ఎంసీఏ, డిప్లొమా విద్యార్హత కలిగి ఉండి సంబంధిత రంగంలో 3 నుంచి 5 సంవత్సరాల అనుభవంతో పాటు 60 ఏళ్ల లోపు వయస్సుగల వారు అర్హులు. ఎంపికైనవారికి ప్రారంభ సంవత్సరిక వేతనం రూ.41 లక్షల నుంచి వారి అనుభవం, నైపుణ్యాన్ని అనుసరించి రూ.71 లక్షల వరకు ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఫ్యామ్లీ వీసా అందజేయడంతో పాటు నిరంతరాయంగా నాలుగు సంవత్సరాలు పనిచేసిన వారికి జర్మన్ పీఆర్ (పర్మనెంట్ రెసిడెన్సీ) ఇస్తారన్నారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 98496 39539, 78935 66493 లలో సంప్రదించవచ్చు.

వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్లు



బంజార దర్వాజ వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో డొమెస్టిక్ సిలిండర్

గోల్కొండ: గృహ అవసరాలకు వాడే ఎల్‌పీజీ డొమెస్టిక్ సిలిండర్లు యథేచ్ఛగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారు. డెలివరి బాయ్స్ చేతివాటంతో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో ప్రత్యక్షమవుతున్నాయి. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. డొమెస్టిక్ అవసరాల వారు బుక్ చేసుకున్న గ్యాస్ సిలిండర్లు డెలివరి బాయ్స్ చాకచక్యంగా బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. మరికొందరు ఎల్‌పీజీ వినియోగదారులను మచ్చిక చేసుకుని వారి వద్ద ఉండే సెకండ్ సిలిండర్‌ను తీసుకుని దానిని బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. ఇటువంటి గ్యాస్ సిలిండర్లను డెలివరి బాయ్స్ దగ్గర అక్రమంగా కొనుక్కున్న వారు గ్యాస్ రీఫిలింగ్ దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. మినీ సిలిండర్లలో డొమిస్టిక్ గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్‌ను ఫిల్లింగ్ చేస్తున్నారు. బ్లాక్‌లో అక్రమంగా ఎల్‌పీజీ సిలిండర్లను అమ్మేవారు గుట్టు చప్పుడు కాకుండా సిలిండర్లను గోదాములలో నిల్వ చేసుకుంటూ అక్రమంగా ఎల్‌పీజీ దందాను చేస్తున్నారు. సంబంధిత అధికారులు నామ్‌కే వాస్తేగా తనిఖీలు నిర్వహిస్తున్నారని, రోడ్ల పక్కనే డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్లు కానిపిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అంటున్నారు.

త్వరలోనే సమగరా జాతి సంఘ్ ఆత్మగౌరవ భవన నిర్మాణం



మంత్రి తలసానిని కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్, సమగరా జాతి సంఘ్ నాయకులు

అబిడ్స్: త్వరలోనే సమగరా జాతి సంఘ్ ఆత్మగౌరవ భవన నిర్మాణం జరిగే విధంగా కృషి చేస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సమగరా జాతి సంఘ్ నాయకులు, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి తలసానిని కలిసి వెంటనే క్యాబినెట్‌లో భవన నిర్మాణం ఆమోదించే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. రాబోయే క్యాబినెట్‌లో సమగరా జాతి ఆత్మగౌరవ సభ నిర్మాణానికి ఆమోద ముద్ర వేయిస్తానన్నారు. వెంటనే నిర్మాణ పనులు కూడా అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని సహకారంతో సమగరా జాతి భవన నిర్మాణ పనులు వెంటనే అయ్యేవిధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. వచ్చే క్యాబినెట్‌లో మంత్రి ప్రత్యేకంగా ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ఆమోద ముద్ర వేయిస్తానన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జానకిరామ్, కృష్ణ, గణపతి, చంద్రమోహన్, ధన్‌రాజ్, ప్రకాష్, రామ్‌ఛరణ్, రాజేష్, రఘునందన్, రాజేందర్, సుదర్శన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



మహ్మద్ అనీఫ్‌కు నియామకపత్రం అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: అన్ని వర్గాల ప్రజలకు అండగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ జాయింట్ సెక్రెటరీగా మహ్మద్ అనీఫ్‌ను నియమించి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం పథకాలు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ప్రగతి, సంక్షేమం కేసీఆర్ ప్రభుత్వంతోనే అవుతుందన్నారు. నియోజకవర్గం నలుమూలలా ప్రజలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోటి శైలేష్ కురుమ, పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో వాటర్‌బోర్డు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

అబిడ్స్: వాటర్‌బోర్డులో ఎస్సీ, ఎస్టీల ఉద్యోగుల సంక్షేమానికి తమ యూనియన్ ముందుంటుందని వాటర్‌బోర్డు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు బోర్డు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రగతి, వారి అభివృద్ధి, తమ అసోసియేషన్ ప్రథమ కర్తవ్యమన్నారు. సమావేశం అనంతరం అసోసియేషన్ కోశాధికారి ఉదయ్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా చేపట్టి ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో శాలెం రాజు, జి.సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, యాదగిరి, నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మోహన్ రాజ్‌లు పాల్గొన్నారు.

హుక్కా పార్లర్ పై దాడి

గోల్కొండ: అక్రమంగా హుక్కా పార్లర్ నిర్వహిస్తున్న ఇద్దరిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాధాకిషన్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ మెహిదీ కాలనీకి చెందిన సయ్యద్ బిలాల్ (22), సయ్యద్ అబ్దుల్ ఖాదర్ (26) సులువుగా డబ్బు సంపాదించడానికి మాసబ్‌ట్యాంక్ సిల్వర్ ఓ అపార్ట్‌మెంట్‌లో రెస్ట్ ఓ లాంజ్ కేఫ్ నిర్వహించారు. ఇందులో చట్టవిరుద్ధంగా హుక్కా పార్లర్ నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో ఈనెల 17న రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషా ఆధ్వర్యంలో ఈ హుక్కా పార్లర్ పై దాడి చేశారు. ఈ సందర్భంగా వారు స్వయంగా సోదరులైన సయ్యద్ బిలాల్, సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా వారి వద్ద నుంచి 27 హుక్కా పాట్స్, 53 స్మోకర్ కాయిల్స్ డబ్బాలు, హుక్కా ఫ్లేవర్ ప్యాకెట్లు 64, హుక్కా ఫ్లేవర్, ఒక కేజీ బాక్సులు 10, స్టౌల్‌లు 4, 52 హుక్కా పైపులు, ప్లాస్టిక్ ఫిల్టర్స్ 25 పీసులు, అల్యూమినియం బాయిల్స్ 9 బాక్సులు, 2 వైర్‌లెస్ సెట్లు, 50 చిల్లం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 1.20 లక్షలు ఉంటుంది. కాగా తదుపరి విచారణ నిమిత్తం హుమాయున్ నగర్ పోలీసులకు అప్పగించారు.

గోల్కొండలో ట్రాఫిక్ పీఎస్ నిర్మాణ పనులు షురూ



కొత్త భవనం కోసం పాత పోలీస్ క్వార్టర్స్‌ను కూల్చుతున్న దృశ్యం

గోల్కొండ: టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ గోల్కొండలో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సాలార్జంగ్ కాలనీలో పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయం లేన్‌లో అద్దె భవనంలో కొనసాగుతుంది. అయితే సొంత భవనాల్లోనే పోలీస్‌స్టేషన్ కొనసాగాలన్న పోలీస్ శాఖ వారి నిర్ణయంతో ప్రస్తుతం ఉన్న టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను గోల్కొండకు తరలించాలనే నిర్ణయం జరిగింది. గోల్కొండ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లోని ఒక క్వార్టర్స్‌ను కూల్చివేసి ఆ ప్రదేశంలో నూతన భవనం నిర్మించడానికి అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో 3 రోజులుగా పాత భవనం కూల్చివేత పనులు జోరుగా సాగుతున్నాయి.

జర్నలిస్టులకు రైలు చార్జీలపై 50 శాతం రాయితీలను పునరుద్ధరించాలి



మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: గుర్తింపు పొందిన జర్నలిస్టులకు రైలు చార్జీలపై 50 శాతం రాయితీలను పునరుద్ధరణ చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. దక్షిణ భారతదేశంలోని వివిధ జర్నలిస్టు అసోసియేషన్‌లు, ప్రత్యేకంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలకు చెందిన గుర్తింపు పొందిన జర్నలిస్టులకు రైల్వే టికెట్లపై ప్రీ-పాండమిక్ చార్జీల పునరుద్ధరణకు సంబంధించి జీఓకి అధికార ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. కోవిడ్-19 లాక్‌డౌన్ సమయంలో ఉపసంహరించబడిన రైలు చార్జీలలో రాయితీలను పునరుద్ధరించాలన్నారు.

ఓటరు జాబితా పరిశీలన



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారి

గోల్కొండ: ఓటరు జాబితాలో నమోదైన పేర్లను బల్దియా అధికారులు ఇంటింటికీ తిరిగి వెరిఫికేషన్ చేస్తున్నారు. బల్దియా కమిషనర్ ఆదేశాలతో బల్దియా సిబ్బంది రెండు రోజులుగా ఓటరు జాబితా తీసుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు ఉన్న వారు ప్రస్తుతం అదే చిరునామాలో ఉన్నారా అనే విషయంతో పాటు ఫొటోలో విషయంపై కూడా విచారణ చేస్తున్నారు. మరోవైపు చిరునామా వారిని గుర్తించి వారి పేర్లను రాసుకుంటున్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేనివారికి పేర్లు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. కార్వాన్ డివిజన్‌లో వెరిఫికేషన్ పనులు జోరుగా సాగుతున్నాయి.

మత్తు పదార్థాలు తరలిస్తున్న ముఠా అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు హనుమంత్ రామ్, చున్నీలాల్

అఫ్జల్‌గంజ్: రాజస్థాన్ నుంచి నగరానికి మత్తు పదార్థాలను (ఓపీఎం) తరలిస్తున్న ముఠాను అఫ్జల్‌గంజ్ పోలీసులతో కలిసి ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన హనుమంత రామ్ జీడిమెట్లలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో దినసరి కూలీ పని చేసేవాడు. ఈ క్రమంలో చున్నీలాల్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. చున్నీలాల్‌కు మత్తు పదార్థాలు తీసుకునే అలవాటు ఉంది. హనుమంత రామ్ దీన్ని ఆసరాగా చేసుకొని రాజస్థాన్‌లో మత్తు పదార్థాలు సాగు చేసే కిల్లు ద్వారా సేకరించాలని నిర్ణయించాడు. అక్కడకు వెళ్లి దాదాపు రూ.1,18,000 ఖరీదు చేసే 1400 గ్రాముల మత్తు పదార్థాన్ని తీసుకొని సికింద్రాబాద్‌లోని చున్నీలాల్‌కు 1040 గ్రాముల మత్తు పదార్థాన్ని ఇచ్చి, మిగతా 360 గ్రాముల ఓపీఎమ్‌ను తీసుకొని గౌలిగూడలో మరో వ్యక్తికి ఇచ్చేందుకు రాగా పక్కా సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అఫ్జల్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి హనుమంత్ రామ్, చున్నీలాల్‌ను అదుపులోకి తీసుకోగా, కిల్లు అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 1400 గ్రాముల ఓపీఎం మత్తు పదార్థం, రెండు మొబైల్ ఫోన్లు, రూ. 2,50,000 నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అర్ధరాత్రి వరకు పాన్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తి జైలు శిక్ష

గౌలిపురా: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు పాన్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ ఎ.శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫైజల్ ఖాన్ (23) పాన్‌షాపును నిర్వహిస్తున్నాడు. ఫైజల్ ఖాన్ పోలీసుల నిబంధనలకు విరుద్ధంగా సమయపాలన పాటించకుండా అర్ధరాత్రి వరకు తన పాన్‌షాపును నిర్వహిస్తున్నాడు. దీంతో మొఘల్‌పురా పోలీసులు ఫైజల్ ఖాన్‌పై పెట్టీ కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరు పరచగా ఫైజల్ ఖాన్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

చలం రచనలతో చైతన్యం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాహితీవేత్త చలం తన రచనలతో సమాజాన్ని చైతన్య పరిచారని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో చలం భావన సంస్థ ఆధ్వర్యంలో చలం ఆత్మకథపై స్మారక ఉపన్యాస సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త నగ్నముని మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, చలం, చెరగని ముద్ర వేశారని కొనియాడారు. సమాజంలో ఏదైన కొత్త విషయాన్ని చెప్పినప్పుడు ఆ కవి వ్యతిరేకతను ఎదుర్కొంటాడని అటువంటి వ్యతిరేకతను నాటి నుంచి నేటి వరకు అనేకమంది కవులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. చలం వ్యాఖ్య నిర్మాణం ఎంతో బాగుంటుందని, ఆయనను అనుకరించేందుకు అనేకమంది ప్రయత్నించినా ఎవ్వరికి సాధ్యం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిద్ధారెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సభ కన్వీనర్ నాశేశ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు.



చలం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితివేత్త నగ్నముని తదితరులు

సన్మానం



జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవనంతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లు అసంపూర్తిగా ఉండడంతో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా ప్రత్యేక నిధులు మంజూరు చేసి వాటి నిర్మాణం పూర్తి చేయడం హర్షణీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గో ఉత్పత్తులను పెంపొందించేందుకు కృషి



ఆశీష్‌కుమార్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మార్వాడి సమాజ్ నాయకులు

అబిడ్స్: గో ఉత్పత్తులను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గోవుల సంరక్షణకు, గో ఉత్పత్తులకు అందరూ తమవంతు ప్రయత్నం చేయాలన్నారు. మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఏక్ శ్యామ్ గోమాతకే నామ్' ఆహ్వాన పత్రాన్ని ఆయనకు అందించారు. జూన్ 3న నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. గో పూజ చేయడం, గో ఉత్పత్తులను పెంపొందించడం, గో సంరక్షణతోనే మనిషికి మానసిక ఉల్లాసం, మానసిక శాంతి కలుగుతుందన్నారు.